సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



భారీగా సీతాఫలాల వ్యాపారం
పాడేరు మండలం వంట్లమామిడి జంక్షన్‌లో ఆదివారం సీతాఫలాల వ్యాపారం భారీగా జరిగింది. వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. 8లో



వైఎస్సార్‌సీపీ నేత చొరవ
అధ్వానంగా మారిన అప్రోచ్ రోడ్డు మెరుగుకు వైఎస్సార్‌సీపీ నేత చొరవ చూపారు. 8లో



జీవనకు ఘన సత్కారం
గ్రూప్–1 ఫలితాల్లో డీఎస్పీ ఉద్యోగం సాధించిన చిట్టపులి జీవనను బంధువులు, గ్రామస్తులు సత్కరించారు. 8లో

న్యూస్‌రీల్

ఘనంగా సత్యదేవుని వ్రతాలు



వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

మారేడుమిల్లి: అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం అధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం సత్యదేవుని సామూహిక వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఈ వ్రతాల్లో 64 దంపతలు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు చిట్టెం నరేష్, వడలి నరసింహమూర్తి పూజలు, వ్రతాలు చేయించారు. ఆలయ కమిషనర్ రమేష్ బాబు, సూపరింటెండెంట్ కిషోర్ బాబు వీర్రాజు, పవన్ గిరి స్వామిజీ, సభ్యులు బల్లంకి రాజేందర్, వంక త్రిమూర్తులు, సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ కన్వీనర్ గుడ్ల శ్రీనివాసరెడ్డి, మహిళ ప్రచారక్ దేవి, ఎంపీపీ సార్ల లలిత కుమారి, బలుసుమిల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.

గుడిస సందర్శన తాత్కాలికంగా నిలిపివేత

మారేడుమిల్లి: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గుడిసకు పర్యాటకుల సందర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రేంజ్ అధికారి ఎస్ఏకే ఆజాద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. వచ్చే కార్తీక మాసాన్ని దృష్టిలో ఉంచు కుని గుడిసలో పారిశుధ్యం, రహదారి పనులు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కారణంగా సోమవారం నుంచి 18వ తేదీ వరకు పర్యాటకుల రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యటకులు గమనించాలని ఆయన కోరారు.

అడ్డతీగల అటవీరేంజి అధికారిగా షహెన్‌షా



వై.రామవరం: అడ్డతీగల అటవీశాఖ రేంజి అధికారిగా ఎస్.షహెన్‌షా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అడ్డతీగల రేంజి పరిధిలోని వై. రామవరం సబ్‌డివిజన్‌లోని దుమ్ముకొండ అటవీప్రాంతాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. అటవీప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన వెంట వై.రామవరం డిప్యూటీ రేంజి అధికారి సీహెచ్ సత్యనారాయణ, బీటు అధికారి సురేష్ తదితరులు ఉన్నారు.


మోదమ్మకు భక్తుల పూజలు



మోదకొండమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం ,పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగానే తరలివచ్చారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మతల్లి పాదాలు గుడికి కూడా భక్తుల తాకిడి నెలకొంది. మోదమ్మకు భక్తులు మొక్కులు తీర్చుకుని, ఇక్కడే వంటలు చేసుకుని కుటుంబాలతో సందడి చేశారు.

మంత్రి అమర్‌నాథ్‌కు సత్కారం



మిందిలో మంత్రి అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న గంగవరం పోర్టు కార్మికులు

అక్కిరెడ్డిపాలెం (విశాఖ): గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేసిన రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కార్మికులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సత్కరించారు. మిందిలోని మంత్రినివాసంలో కార్మికులు అమర్‌నాథ్‌ను కలిసి యాజమాన్యం ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తిప్పల గురుమూర్తి రెడ్డి, జెర్రిపోతుల ముత్యాలు, కసిరెడ్డి సత్యనారాయణ, చీకటి అప్పారావు, పోర్టు నిర్వాసిత ఉద్యోగులు జి.అమ్మోరు, నొల్లి తాతారావు, కదిరి సత్యారావు, నూకరాజు పాల్గొన్నారు.

మన్యంలోని సీతమ్మకొండకు అరుదైన ఖ్యాతి సొంతం కానుంది. రాష్ట్రంలో అత్యంత ఎత్తులో ఉన్న పర్వతశిఖరంగా హుకుంపేట మండలంలోని ఈ (అర్మ)కొండను భారత ఆర్మీ గుర్తించింది. హర్ శిఖర్ తిరంగాలో భాగంగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ (నిమాస్) డైరెక్టర్ కల్నల్ రణవీర్‌సింగ్ జమ్వాల్ ఆధ్వర్యంలో 15 మందితో కూడిన ఆర్మీ బృందం పర్వతాన్ని అధిరోహించనుంది.

అరుదైన కీర్తి శిఖరం

- సీతమ్మకొండపై నేడు హర్ శిఖర్ తిరంగా
- జాతీయ జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు
- నిమగ్నమైన పర్యాటకశాఖ
- నిమాస్ ఆధ్వర్యంలో పర్వతారోహణ



హర్ శిఖర్ తిరంగా కార్యక్రమం నిర్వహించనున్న సీతమ్మకొండ

సాక్షి, పాడేరు: అరమ కొండను ప్రాంతీయంగా సీతమ్మకొండ , జెండా కొండ అని.. మరికొందరు జిందగడ అని కూడా పిలుస్తుంటారు. భారతదేశ తూర్పు కనుమల్లో అత్యంత ఎత్తయిన శిఖరంగా 2011 వరకు ఒడిశాలోని మహేంద్రగిరి ఉండేది. ఆ తరువాత ఎత్తయిన శిఖరంగా సీతమ్మకొండను గుర్తించారు. సముద్రమట్టానికి 5,547 అడుగుల ఎత్తులో ఉంది. టెక్కింగ్‌కు ఇష్టపడే వారికి ఈశిఖరం అనువైనదిగా చెప్పవచ్చు. హుకుంపేట మండలంలోని ఓలుబెడ్డ గ్రామానికి చేరుకుని అక్కడి నుంచి సీతమ్మకొండకు వివిధ మార్గాల్లో వెళ్లవచ్చు. పర్వత పాదం నుంచి శిఖరానికి చేరుకోవాలంటే సుమారు రెండు కిలోమీటర్ల దూరం నడవాలి.

సీతమ్మవారు నడయాడిన నేలగా..

ఈ ప్రాంతాన్ని పూర్వం నుంచి గిరిజనులు సీతమ్మవారు నడిచిన నేలగా భావిస్తున్నారు. రంగశీల గ్రామానికి చెందిన గిరిజనులు ఈ కొండ దిగువన సీతమ్మ తల్లికి గుడిని కూడా నిర్మించారు.

స్వాతంత్య్ర సమరయోధులకు స్థావరంగా..

పూర్వం బ్రిటిష్ పాలనలో కూడా స్వాతంత్య్ర సమర యోధులు ఈకొండపై స్థావరాలు ఏర్పాటు చేసుకునే వారని ప్రచారంలో ఉంది. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తరువాత ఈ సీతమ్మ కొండపై భారతదేశ జెండాను అప్పట్లో పూర్వీకులు ఎగురవేయడంతో జెండా కొండ అని కూడా పిలుస్తుంటారు.

సాహసయాత్రలకు ప్రణాళిక..

హుకుంపేట మండలంలోని తడిగిరి, తీగలవలస, రంగశీల పంచాయతీలతో పాటు సరిహద్దు డుంబ్రిగుడ వరకు సీతమ్మ కొండ విస్తరించి ఉంది. గత ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సీతమ్మకొండపై ట్రెక్కింగ్ చేపట్టారు. అక్కడ ప్రకృతి అందాలకు మంత్రముగ్ధుడైన ఆయన పర్యాటక ప్రాంత అభివృద్ధితోపాటు సాహసయాత్రలకు ప్రణాళికలు రూపొందించారు.

- టెక్కింగ్‌కు వెళ్లాలనుకునే వారు తడిగిరి, తీగలవలస పంచాయతీ కేంద్రాలకు చేరుకుని ఓలుబెడ్డ మీదుగా వివిధ మార్గలో పర్వత ప్రాంతానికి వెళ్తుంటారు. అరకు రోడ్డులో రంగశీల నుంచి కూడా అక్కడకు వెళ్లేందుకు మార్గం ఉంది. పర్వత శిఖరానికి చేరుకునేందుకు రెండు నుంచి మూడు గంటల సమయం పడుతుంది.
- శీతాకాలంలో పొగమంచు, సూర్యోదయం అందాలను వీక్షించేందుకు పర్యాటకులు భారీగానే సీతమ్మ కొండకు తరలివస్తుంటారు.
- పర్యాటకులు, స్థానికులు ఇప్పటికే జాతీయ జెండాను పలు సందర్భాల్లో ఆవిష్కరించారు. ఇక్కడ నిత్యం మువ్వన్నెల జెండా రెపరెపలాడుతూ ఉంటుంది.
- సీతమ్మ కొండపై సోమవారం హర్ శిఖర్ తిరంగాలో కల్నల్ రణవీర్ సింగ్ జమ్వాల్ ఆధ్వర్యంలో ఆర్మీ బృందం జాతీయ జెండాను అత్యంత ఘనంగా ఆవిష్కరించనుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లలో పర్యాటకశాఖ నిమగ్నమైంది.



సీతమ్మకొండపై పాలపొంగును తలపిస్తున్న మంచు అందాలు



సూర్యోదయం వేళ అద్భుత దృశ్యం



సీతమ్మకొండపై మేఘాల దోబూచులాట

భర్తను హత్య చేసిన భార్యకు రిమాండ్

- అనుమానమే గొడవకు కారణం
- కేసు వివరాలు వెల్లడించిన ఏఎస్పీ ప్రతాప్‌శివకిశోర్



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్

చింతపల్లి రూరల్ : భర్తను హత్య చేసిన భార్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులకు తెలిపిన వివరాలివి. జి.కె వీధి మండలం సపర్లకు చెందిన కొర్ర కృష్ణారావు, గెమ్మెల వీరమ్మ దంపతులు గత బుధవారం గొడవ పడ్డారు. గొడవ ముదిరి వీరమ్మ భర్త కృష్ణారావును గొడ్డలితో తలపై కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన కృష్ణారావును ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. ఈ ఘటనపై కృష్ణారావు తల్లి కొర్రా లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. జి.కె వీధి సీఐ అశోక్‌కుమార్, సీలేరు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా కృష్ణారావుకు గతంలో పెళ్లై ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతని భార్య రెండేళ్ల క్రితం మృతి చెందడంతో అదే గ్రామంలో భర్త చనిపోయి ఉంటున్న వీరమ్మను వివాహమాడాడు. తన మొదట భార్య పిల్లలను వీరమ్మ సరిగ్గా చూడటం లేదనే భావనతో పాటు ఒకరిపై ఒకరు అనుమానంతో ఇద్దరూ నిత్యం గొడవ పడేవారు. పిల్లలను హాస్టల్‌లో చేర్పించి, వీరమ్మ పిన్ని ఇంట్లో చట్రపల్లిలో నివాసముంటుంది. ఇద్దరూ తరుచూ గొడవలు పడడంతో విసుగు చెందిన వీరమ్మ అతని అడ్డు తొలగించుకోవాలని కృష్ణారావు తలపై గొడ్డలితో మూడుసార్లు కొట్టింది. దీంతో తీవ్ర రక్తస్రావంతో పడిపోయిన కృష్ణారావును ఆస్పత్రికి తరలించగా గురువారం మృతి చెందాడు. ఘటనపై దర్యాప్తు జరిపిన పోలీసులు ఆధారాలు సేకరించి వీరమ్మను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

మన్యంలో భారీ వర్షం



రాజవొమ్మంగి మండలంలో పొంగి ప్రవహిస్తున్న శరభవరం కాలువ

కొయ్యూరు: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. సంతకు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీడీపీవో కార్యాలయానికి వెళ్లే రహదారి జలమయం అయింది.

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. బందవీధి, జీఎం కొత్తూరు, ఉరుము, గాంధీనగరం, కంఠవరం, సింగర్బ, పార్లు, కర్నికలంక తదితర గ్రామాల్లో రహదారులు జలమయం అయ్యాయి. పంటపొలాల్లో జలకళ సంతరించుకుంది. పాడేరు–జి.మాడుగుల, చింతపల్లి రోడ్డులోను, నుర్మతి, మద్దిగరువు, సొలభం, వంజరి, గడుతూరు రోడ్డు మార్గాల్లో ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

రాజవొమ్మంగి: మండలంలో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. లాగరాయి వెళ్లే మార్గంలో కొండవాగు పొంగి ప్రవహించింది. వాతంగిలో భారీ వర్షం కురిసింది. పొతురాజుబాబు గండి వద్ద పాల కాలువ పొంగింది. జడ్డంగి, అమీనాబాద్ వెళ్లాల్సిన సమస్యలు ఎదుర్కొన్నారు.



వర్షం నీటితో నిండిపోయిన సీడీపీవో కార్యాలయ రహదారి

మలేరియా నివారణకు సమష్టి కృషి

- ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ రామిరెడ్డి
- రంపచోడవరం ఐటీడీఏలో వైద్యశాఖ అధికారులతో సమీక్ష



నరసాపురంలో సూచనలిస్తున్న రామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ రామిరెడ్డి

రంపచోడవరం: మలేరియా కేసులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖ సమష్టిగా పనిచేసి నివారణ చర్యలు చేపట్టాలని ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డా.వి.రామిరెడ్డి తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆదివారం రంపచోడవరం, చింతూరు డివిజన్ పరిధిలోని వైద్యాధికారులు, సిబ్బందితో మలేరియా, డెంగీ వ్యాధుల నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మలేరియా కేసులు ఎక్కువగా ఉన్న పీహెచ్‌సీలకు చెందిన వైద్యాధికారులతో ప్రాంతాల వారీగా సమీక్షించారు. మలేరియా కేసులు నియంత్రణకై పటిష్టమైన చర్యలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా ప్రభావం ఎక్కువగా ఉన్న చోట ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశ కార్యకర్తలు, సబ్ యూనిట్ అధికారులు దోమ తెరల వినియోగంపై గిరిజనులకు అవగాహన కల్పించాలని సూచించారు. దోమ తెరలు వినియోగిస్తున్నారా లేదా అనేది పరిశీలించాలని సూచించా రు. ఇంకా అవసరమైన దోమ తెరలు పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. నెల రోజుల పాటు మలేరియా కేసులు తగ్గుముఖం పట్టే లక్ష్యంతో పనిచేయాలని ఆదేశించారు. గిరిజనులకు అందుతున్న వైద్య సేవలపై క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు.

నరసాపురం పీహెచ్‌సీ సందర్శన

నరసాపురం పీహెచ్‌సీని ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డా.వి.రామిరెడ్డి సందర్శించారు. గిరిజనులకు అందుతున్న వైద్య సేవలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం ఈతలపాడు, ఐ. పోలవరం గ్రామాల్లోని మలేరియా జ్వరంతో బాధ పడుతున్న వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. వైద్యుల సూచనలు మేరకు మందులు వేసుకోవాలన్నారు. ఫ్రైడే– డ్రై డే కార్యక్రమం అమలులో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు నిరంతరంగా గృహాలను సందర్శించాలని సూచించారు. స్థానిక పాఠశాల ఆవరణలో నిరుపయోగంగా ఉన్న వర్షపు నీటి నిల్వను గుర్తించి సత్వరమే వాటిని లేకుండా చూడాలన్నారు. జోనల్ మలేరియా అధికారి డా. బి సుబ్రహ్మణేశ్వరి మాట్లాడుతూ మలేరియా నిర్మూలనకు సిబ్బంది కష్టపడి పనిచేయాలని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయడం ద్వారా మలేరియాను నిర్మూలించవచ్చని సూచించారు. మలేరియా మందులు, కిట్ల కొరత లేదన్నారు. సమీక్షలో ఏడీఎంహెచ్‌వోలు డా. ప్రకాశం, బీఎల్ఎన్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ పీఎస్ఎస్ ప్రసాద్, డీఎంవో వీర్రాజు పాల్గొన్నారు.



ఐ పోలవరంలో మలేరియా బాధితుడితో మాట్లాడుతున్న డైరెక్టర్

విద్యుత్ సరఫరా అంతరాయం నివారణకు ప్రణాళికలు

- పరిశ్రమలకు వారంలో ఒక రోజు పవర్ హాలిడే
- వైద్య సంబంధిత పరిశ్రమలు, రైస్ మిల్లులకు మినహాయింపు
- రెండు వారాల పాటు పవర్ హాలిడే అమలు
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



సాక్షి విశాఖపట్నం : గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఏపీఈఆర్‌సీ ఆదేశాల మేరకు అవసరమైన ప్రణాళికలు అమలు చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృధ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు. గృహ, పారిశ్రామిక రంగాలతో పాటు వ్యవసాయానికి 9 గంటల విద్యుత్తును సరఫరా చేసేందుకు విద్యుత్తు పంపిణీ సంస్థలు, ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఏర్పడిన విద్యుత్ కొరత కొంత ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రోజువారీ విద్యుత్తు సరఫరా అవసరాలకు ప్రస్తుతం 230 మిలియన్ యూనిట్ల విద్యుత్తు అవసరం వుండగా థర్మల్, హైడల్, గ్యాస్, పవన, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 190 మిలియన్ యూనిట్ల విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి అవుతుదని ఇంకా 40 మిలియన్ యూనిట్ల వరకూ కొరత వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో గృహ, వ్యవసాయ రంగాల అవసరాలకు తగిన ప్రాధాన్యమిచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అదేవిధంగా లోటు వర్షపాతం కారణంగా వ్యవసాయ సాగు కోసం ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా, డిమాండ్ స్థితి, ఎక్స్చేంజీల నుంచి విద్యుత్ కొనుగోళ్ల పరిమాణం వాటి ప్రస్తుత ధరల్ని పరిశీలించిన కమిషన్ రాష్ట్రంలోని పరిశ్రమల విద్యుత్ వినియోగంపై కొన్ని నియంత్రణ చర్యలను చేపట్టేందుకు అనుమతించినట్లు వివరించారు. ఇందులో భాగంగా సంస్థ పరిధిలో నిరంతర ప్రాసెసింగ్ పరిశ్రమలు తమ రోజువారీ విద్యుత్ వినియోగంలో 30 శాతం కాంట్రాక్టు లోడులో తగ్గించుకొనే విధంగా ఆయా పరిశ్రమలు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎండీ పృధ్వీతేజ్ సూచించారు. ఇతర పరిశ్రమలు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు ఒక షిఫ్ట్ మాత్రమే పనిచేయాలని, సాయంత్రం 6 తరువాత విద్యుత్ వినియోగానికి అనుమతిం చేది లేదని స్పష్టం చేశారు. వారానికి ఒకరోజు పవర్ హాలిడేను కూడా అమలు చేయాలని సూచించారు. పవర్ హాలిడేను జిల్లాల వారీగా రెగ్యులేట్ చేస్తామని, ఈ నెల 5 నుంచి 15 వరకూ రెండు వారాల పాటు పవర్ హాలిడే అమల్లో ఉంటుందని వివరించారు. ఈ నియంత్రణ చర్యల నుంచి బల్క్ డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్, వైద్య ఆక్సిజన్ ప్లాంట్లకు, రైస్ మిల్లింగ్ యూనిట్లకు సంబంధించిన పరిశ్రమలు మినహాయిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలను అతిక్రమించే పరిశ్రమలకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. వీలైనంత త్వరగా మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ప్రయత్నిస్తామని విద్యుత్ లభ్యత మెరుగైనట్లయితే పవర్ హాలిడేను ఎత్తివేస్తామని, పారిశ్రామిక వినియోగదారులు సహకరించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై వినియోగదారులు ఏపీఈపీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ 1912 కు ఫోన్ చేసి తెలపవచ్చని సీఎండీ పృధ్వీతేజ్ ఇమ్మడి సూచించారు.

సంగీత నృత్యోత్సవంతో విశాఖకు కీర్తి



టీఎం కృష్ణ గాత్ర కచేరి

మద్దిలపాలెం (విశాఖ): విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న సంగీత నృత్యోత్సవంతో విశాఖ కీర్తి మరింత ఇనుమడింపచేశారని రియల్ అడ్మిరల్ విజయశేఖర్ అన్నారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో రెండో రోజు కార్యక్రమానికి రియల్ అడ్మిరల్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరాజు, డాక్టర్. వి.ఆర్.కె.రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం రియల్ అడ్మిరల్ విజయశేఖర్ మాట్లాడుతూ సంగీత ప్రియులు, నాట్య అభిమానులు, నాటక ప్రియులు వారం రోజుల పండగ చేసుకునేలా ఎంతో ఘనంగా వేడుకలను నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం టి.ఎం.కృష్ణ గాత్ర కచేరి ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. కచేరికి ప్రసిద్ధ వయోలిన్ విద్వాంసుడు హెచ్.ఎస్.భాస్కర్, మృదంగంపై డాక్టర్ వంకాయల వెంకట రమణ సహకారం అందించారు.

ప్రకృతి కళకళ



ఒకపక్క వరినాట్లతో కళకళలాడుతున్న పొలాలు.. మరోపక్క కొండలను తాకుతున్న మేఘమాలలతో నాగులకొండ పరిసరాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. వర్షం కురిసిన కాసేపటి తరువాత ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. - రాజవొమ్మంగి

వైఎస్సార్‌సీపీ నేత చొరవ

అప్రోచ్‌రోడ్డు మెరుగుకు చర్యలు

అనంతగిరి: మండలంలోని గుమ్మకోట పంచాయతీ భీమవరం సమీపంలోని వంతెనకు ఇరువైపులా అప్రోచ్‌రోడ్డు వర్షాల కారణంగా బురదమయంగా మారింది. ఎస్‌కోట నుంచి గుమ్మకోటకు నడిచే ఆర్టీసీ బస్సును నాలుగు రోజులుగా బిల్లకోట వరకు మాత్రమే నడుపుతున్నారు. దీంతో ప్రజల ఇబ్బందులను గుర్తించిన వైఎస్సార్‌సీపీ నేత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొర్రా సూర్యనారాయణ, కాంట్రాక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఆదివారం కూలీలతో కలిసి అప్రోచ్‌రోడ్డు ఇరువైపులా క్రషర్ బూడిదను వేయించారు. రోడ్డు మెరుగుపడ టంతో గుమ్మకోట వరకు ఆర్టీసీ బస్సు నడిచింది.

జీవనకు ఘన సత్కారం

హుకుంపేట: ఇటీవల విడుదలైన గ్రూప్–1 ఫలితాల్లో డీఎస్పీ ఉద్యోగం సాధించిన చిట్టపులి జీవనను బంధువులు, గ్రామస్తులు ఆదివారం సత్కరించారు. మండలంలో సుకురు గ్రామంలో సర్పంచ్ సత్యవతి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గిరిజన పేద కుటుంబంలో పుట్టి డీఎస్పీ ఉద్యోగం సాధించడం గర్వకారణమన్నారు. జీవన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు. నాయకులు ధనసాని మురళి, భూషణ్, ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, ప్రవీణ్, రవి, మల్లేష్ పాల్గొన్నారు.

భారీగా సీతాఫలాల వ్యాపారం

సాక్షి,పాడేరు: మండలంలోని వంట్లమామిడి జంక్షన్‌లో ఆదివారం సీతాఫలాల వ్యాపారం భారీగా జరిగింది. జి.మాడుగుల, పాడేరు మండలాలకు చెందిన గిరిజన రైతులంతా పెద్ద మొత్తంలో బుట్టలతో సీతాఫలాలను తీసుకువచ్చారు. వ్యాపారులంతా పోటీపడి కొనుగోలు చేశారు. బుట్ట పండ్లను రూ.400నుంచి రూ.500 ధరకు విక్రయించినట్టు గిరి రైతులు తెలిపారు. కోల్‌కతా, విజయవాడ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు సీతాఫలాలను ప్యాకింగ్ చేసి వ్యాన్లలో తరలించారు. మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులు, పర్యాటకులు కూడా కొనుగోలు చేయడంతో వ్యాపారం భారీగా జరిగింది. ఉదయం 10 గంటలకు వరకు జంక్షన్ రద్దీగా మారింది.

నేత్రదానంతో చిరంజీవులుగా జీవిద్దాం

బీచ్‌రోడ్డు: మరణానంతరం నేత్రదానం చేయడం వలన చిరంజీవులుగా జీవిద్దామని నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు పిలుపునిచ్చారు. 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ర్యాలీని కేకే రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు కోల్పోయి చాలా మంది బాధపడుతున్నారని వారి జీవితాల్లో నూతన వెలుగులు నింపేందుకు మరణించిన మన కుటుంబ సభ్యుల నేత్రాలను దానం చేసేందుకు ప్రోత్సహించా లన్నారు. నేత్రదానంపై ఇటువంటి అవగాహన కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న కేకే రాజు

ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చి రాజు, వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

కొమ్మాది: తన స్నేహితుడితో బీచ్‌లో సరదాగా గడిపేందుకు వచ్చి ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన సంఘటన రుషికొండ బీచ్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, లైఫ్ గార్డ్స్ తెలిపిన వివరాలు ప్రకారం పెందుర్తిలో నివాసం ఉంటున్న విజయ్ కుమార్ పట్నాయక్ (41), సిబిరాజ్ బెహారా ఇద్దరు స్నేహితులు. వీరు ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరిద్దరు ఆదివారం సాయంత్రం సరదాగా గడిపేందుకు రుషికొండ బీచ్‌కు వచ్చారు. కాసేపు గడిపిన తరువాత బీచ్‌లో స్నానాలు చేసేందుకు వెళదామనుకున్నారు. ఆదివారం కావడంతో రుషికొండ బీచ్ పర్యాటకులతో నిండిపోయింది. ఈ క్రమంలో వీరిద్దరు కాస్త దూరంగా వెళ్లి స్నానాలు చేసేందుకు బీచ్‌లో దిగారు. అలల ఉధృతి ఒక్కసారిగా రావడంతో విజయ్ కుమార్ పట్నాయక్ మునిగిపోయాడు. సిబిరాజ్ అప్రమత్తమై తీరానికి చేరుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు.



తీరంలో విజయ్ కుమార్ మృతదేహం

విజయ్‌కుమార్ పట్నాయక్ మునిగిపోతున్న విషయాన్ని గమనించిన లైఫ్‌గార్డ్స్, మెరైన్ పోలీసులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే విజయ్‌కుమార్ మృతి చెందాడు. విజయ్ కుమార్ మృతదేహాన్ని లైఫ్‌గార్డ్స్ తీరానికి తీసుకుని వచ్చి పీఎం పాలెం పోలీసులకు సమాచారం అందించారు. వీరిద్దరు చత్తీస్‌గఢ్‌కు చెందిన వారు. బతుకు తెరువు కోసం కొన్నాళ్లుగా పెందుర్తిలో నివాసముంటున్నారు. విజయ్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

విజ్ఞానానికి వివేకం తోడైతే విజయం మీదే..

- గ్రూప్–2 పోస్టుల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం
- 'సాక్షి' మీడియా గ్రూపు, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్తంగా గ్రూప్–2 ఉద్యోగాలపై అవగాహన
- హాజరైన లెజెండరీ ఫ్యాకల్టీలు అబ్దుల్ కరీం, కృష్ణారెడ్డి, పాషా, హరికృష్ణ



మాట్లాడుతున్న హిస్టరీ ఫ్యాకల్టీ డాక్టర్ అబ్దుల్ కరీం. చిత్రంలో ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ కిరణ్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం: పోటీ పరీక్షల్లో రాణించాలంటే వైవిధ్యమైన ఆలోచనకు సృజనాత్మకత జోడించడం ద్వారా విజయం సాధించవచ్చని హిస్టరీ ఫ్యాకల్టీ డాక్టర్ అబ్దుల్ కరీం అన్నారు. ఎంత మంది విద్యార్థులు పోటీ పరీక్షలు రాసినా..విజ్ఞానంతో పాటు వివేకం తోడైతేనే విజయం సొంతమవుతుందని సూచించారు. రామాటాకీస్ సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో 'సాక్షి మీడియా గ్రూపు', 'హైదరాబాద్ ఆర్‌సీ ఆన్‌లైన్ ఎగ్జామ్స్ సంస్థ' సంయుక్తంగా గ్రూపు–2 పోటీ పరీక్షలపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం త్వరలో గ్రూపు–2 ద్వారా పెద్దసంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్న సమయంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించడమే లక్ష్యంగా..ఇందుకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు అవగాహన సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సదస్సులో పోటీ పరీక్షల్లో నిష్ణాతులుగా పేరొందిన అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ కరీం (హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), బి.కృష్ణారెడ్డి (పాలిటీ), ఎండీ పాషా తదితరులు గ్రూపు–2 పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కరీం మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో మన ప్రిపరేషన్ ప్రశ్నపత్రం స్థాయికంటే ఉన్నతంగా ఉండాలి. పరీక్షల స్టాండర్డ్స్ ఎప్పటికప్పుడు పెరుగుతున్న నేపథ్యంలో శిక్షణ కఠినతరంగా ఉండాలని తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో శిక్షణ లభిస్తున్నప్పటికీ ఆఫ్‌లైన్‌లో పొందే శిక్షణ ద్వారా పోటీతత్వం తెలుస్తుందని పేర్కొన్నారు. పోటీతీవ్రతను దృష్టిలో ఉంచుకుని మన పక్కవాని కంటే ఒక మార్కు ఎక్కువ సాధించేలా శ్రమించేలా ఎప్పటికప్పుడు సబ్జెక్టులో అప్డేట్ అవుతూ ఉండాలన్నారు. నిష్ణాతులైన, అనుభవం కలిగిన లెజండరీ ఫ్యాకల్టీ ఒకేచోట ఉన్న ఆర్‌సీ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందితే విజయం మీ సొంతమవుతుందన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ హరికృష్ణ మాట్లాడుతూ ఇతరుల అనుభవాలను తెలుసు కోవడం ద్వారా అభ్యర్థులు విజయం సాధించవచ్చున్నారు. మనం చదివే ప్రతీ సబ్జెక్టును మనచుట్టూ ఉన్న పరిస్థితులకు అనుగుణంగా అన్వయించుకోవాలన్నారు. ఎక్కువసార్లు సాధన చేయడమే విజయ రహస్యమన్నారు.

ఎకానమీ ఫ్యాకల్టీ ఎం.డి. పాషా మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో సమయం ఎంతో విలువైనదని, నోటిఫికేషన్ జారీచేసేలోగా సిలబస్ పూర్తి చేస్తే.. ప్రిపరేషన్లో ముందు ఉండాలన్నారు. ఎకానమీ సబ్జెక్టు అభ్యర్థులు విజయాన్ని డిసైడ్ చేస్తుందని, సరైన ప్రణాళిక విజయానికి బాటలు వేస్తుందన్నారు.

పాలిటీ ఫ్యాకల్టీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ..పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ప్రశ్నలు ఎలా వస్తాయో ఊహించేలా సబ్జెక్టుపై పట్టు సాధించాలన్నారు. ఇందుకు తగ్గ విజయప్రణాళికను సిద్ధం చేసుకోవాలి సూచించారు.

టాపర్లకు నగదు బహుమతి

పోటీ పరీక్షల నిపుణులు గ్రూప్–2 పరీక్ష విధివిధానాలు, మార్కులు సులువుగా సాధించే అంశాలపై మెలకువలు, ఉదాహరణలతో వివరించారు. అనంతరం అభ్యర్థులకు ఆఫ్‌లైన్ పరీక్ష నిర్వహించి..ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన అభ్యర్థులకు నగదు బహుమతి, స్టడీ మెటీరియల్, తర్వాత స్థానాల్లో నిలిచిన 20 మందికి ప్రామాణిక స్టడీ మెటీరియల్ అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన పి.శిరీషకు, ద్వితీయ స్థానంలో కె.ప్రతాప్, తృతీయ స్థానంలో పి.పవన్ కళ్యాణ్‌లకు నగదు బహుమతి, స్టడీ మెటీరియల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో 'సాక్షి' విశాఖ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ చంద్రరావు, సాక్షి ప్రకటనల డీజీఎం శ్రీనివాసరావు, రీజినల్ ఈవెంట్ ఇన్‌చార్జి ఆర్.మారుతి, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ప్రెసిడెంట్ కల్యాణ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల్లో ప్రథమ బహుమతి సాధించిన శిరీషకు బహుమతి అందిస్తున్న హిస్టరీ ఫ్యాకల్టీ అబ్దుల్ కరీం. చిత్రంలో ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ కిరణ్‌కుమార్



కార్యక్రమానికి హాజరైన అభ్యర్థులు

అత్యుత్తమ గ్రూప్–2 శిక్షణ అందిస్తున్నాం



వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ఫ్యాకల్టీలతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో శిక్షణ అందిస్తున్నాం. ఇప్పటివరకూ ఆన్‌లైన్ విధానంలో వేల సంఖ్యలో అభ్యర్థులు తమ వద్ద శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించారు. హైదరాబాద్ అశోక్ నగర్‌లోని తమ ఇన్‌స్టిట్యూట్‌లో సెప్టెంబర్ 8వ తేదీ నుంచి ఆఫ్‌లైన్ గ్రూప్–2 బ్యాచ్‌లు ప్రారంభంకానున్నాయి. హైదరాబాద్ వరకూ రాలేని ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు కోసం ఆర్‌సీ ఎగ్జామ్ మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్ కోచింగ్ అందించనున్నాం. వివరాల కోసం 89850 94499 నంబర్‌లో సంప్రదించాలి.

–మొండెం కిరణ్‌కుమార్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్, హైదరాబాద్

చక్కటి మార్గనిర్దేశం..



'సాక్షి' మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ పరీక్షలో ప్రథమ బహుమతి సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది. గ్రూప్–2 పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే విద్యార్థులు తీసుకోవాల్సిన అంశాలపై నిపుణులైన ఫ్యాకల్టీ చక్కటి మార్గనిర్దేశం చేశారు. ఈ అవగాహన సదస్సు ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. పోటీ పరీక్షలకు తొలిసారిగా సిద్ధపడే అభ్యర్థులు సైతం తక్కువ సమయంలో ఎలా విజయం సాధించవచ్చో వివరించారు.

– పి.శిరీష, ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థి

ఉన్నత కొలువుల సాధనకు దిక్సూచి



ఉన్నత కొలువులు సాధించాలని సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఇలాంటి అవగాహన సదస్సులు దిక్సూచిలా ఉపయోగపడతాయి. ఈ అవగాహన కార్యక్రమంలో లక్ష్యాన్ని ఎలా సాధించాలో తెలుసుకున్నా. సాక్షి యాజమాన్యానికి ధన్యవాదాలు. ఉన్నత కొలువు సాధించాలనే నా లక్ష్యానికి ఈ సదస్సు చక్కటి మార్గనిర్దేశం చేసింది.

– ఆదారి లోకేష్, విద్యార్థి

ఆత్మవిశ్వాసం పెరిగింది



అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందడంతో పాటు వారిలో నిత్యం విజయకాంక్ష ఉండేలా స్ఫూర్తి కలిగించారు. ప్రణాళికబద్ధమైన సాధన విజయాన్ని సాధిస్తుందని, ఉదాహరణలతో చెప్పిన తీరు అద్భుతంగా అనిపించింది. గ్రూప్స్–2కు సన్నద్ధమవుతున్న నాలాంటి అభ్యర్థులకు «సాక్షి» ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన సదస్సు ఓ వరం లాంటిది.

– కొట్ని నాగమణి, వడ్లపూడి, విద్యార్థి

విషాహారం తిని మేకల మృతి

పెంపకందారుడికి రూ. 1.80 లక్షల నష్టం



మేకల కళేబరాలు

చీడికాడ: విషాహారం తిని తొమ్మిది మేకలు మృతి చెందిన సంఘటన మండలంలోని అర్జునగిరిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చెలిబోయిన ఈశ్వరరావుకు చిన్నా పెద్దా కలిపి 30 మేకలు ఉన్నాయి. వాటిపైనే ఆయన కుటుంబం జీవనాధారంగా బతుకుతోంది. ఉదయం వాటికి ఈశ్వరరావు కుమారుడు ఎప్పటి మాదిరిగానే బకెట్లో కుడితిని పెద్ద మేకలకు పెట్టాడు. అవి తాగిన గంట తర్వాత వాటి పొట్టలు పొంగి నోటి వెంట నురుగులు కక్కుతూ ఒకదాని వెంట మరొకటి మృతి చెందాయి. ఈ సమాచారం పెదగోగాడ పశువైద్యాధికారి గాయిత్రిదేవికి ఇవ్వడంతో సిబ్బందితో వచ్చి మిగిలిన మేకలకు చికిత్సలు అందించారు. ఇదిలా ఉంటే పెంపకందారుడు తన మేకలకు బీమా చేయించకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం అందించలేమని పశువైద్యాధికారి తెలిపారు. దీంతో బాధితుడికి రూ. 1.80 లక్షలు నష్టపోయినట్లు సర్పంచ్ బి.రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

మునగపాక: మునగపాకకు చెందిన విద్యార్థిని అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ మహమ్మద్ అలీ షరీఫ్ తెలిపారు. ఆయన విలేకరులకు ఆదివారం తెలి పిన వివరాలివి. మునగపాక మెయిన్‌రోడ్డులో నివాసం ఉంటున్న శ్రీనివాసరావు–నాగమణి దంపతులు స్థానికంగా హోటల్ నిర్వహిస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. వారి కుమార్తె అపర్ణ ఇటీవల పదో తరగతి పూర్తి చేసింది. ఆదివారం ఉదయం తల్లిదండ్రులు ఇంటి నుంచి హోటల్ నిర్వహణకు వచ్చారు. కొంత సేపటి తరువాత అపర్ణ ఇంటి వద్ద కనిపించకపోవడంతో సమీప బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికారు. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయించారు. అపర్ణ తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

నర్సీపట్నం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రికెట్ పోటీలను పీఆర్టీయూ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో విజేతలకు సోమవారం గురుపూజోత్సవం సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న పీఆర్టీయూ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గోపినాథ్

జాతీయ అవార్డు గ్రహీతకు సత్కారం

మురళీనగర్ (విశాఖ): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన శివాజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఎం.ఉమాగాంధీని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం తరపున గిడుగు అవార్డుకు ఎంపికై సత్కారం పొందిన మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని ఎ.హైమావతి, విశ్రాంత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుప్పిలి లక్ష్మీవరప్రసాద్‌ను మహిళలు ఘనంగా సత్కరించారు.



ఉమాగాంధీని సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గాదేవి, క్లబ్ కార్యదర్శి ఎస్.పుష్పలత. పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష ,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 14 రోజుల రిమాండ్

చోడవరం రూరల్: లైంగిక వేధింపుల కేసులో నిందితుడు వేచలపు గంగాధర్ (45)ను అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడిని విశాఖ సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. దేవరాపల్లి మండలం వేచలం గ్రామానికి చెందిన నిందితుడు గంగాధర్ చోడవరంలోని సిటిజన్ కాలనీలో ఉంటున్నాడని తెలిపారు. అతడు బాలికను వేధింపులకు గురి చేస్తున్నట్టు శుక్రవారం ఆమె బంధువుల నుంచి ఫిర్యాదు అందడంతో నిందితునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. శనివారం బాధితురాలి నుంచి వీడియో, ఆడియో వాంగ్మూలాలను సేకరించి, పకడ్బందీగా దర్యాప్తు ప్రక్రియ పూర్తి చేసి అరెస్టు చేశామన్నారు.



• అపురూపం.. అమ్మ దర్శనం

గవరపాలెం నూకాంబిక అమ్మవారు ఆదివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ మాసం మూడో ఆదివారం కావడంతో పలు రకాల పువ్వులు, తులసీదళాలతో అమ్మవారిని అలంకరించారు. దర్శనానికి భక్తులు బారులు తీరడంతో ఆలయం కిటకిటలాడింది. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

–అనకాపల్లి టౌన్

ప్రాథమిక దశలో గుర్తిస్తే వైరస్‌ల నియంత్రణ

కొమ్మాది : కరోనా వైరస్ ఒక దేశం నుంచి మరో దేశానికి విస్తరించకుండా ఉండాలంటే ప్రపంచ ఆరోగ్య నియంత్రణ సూత్రాలు విధిగా అమలు చేయాలని భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ అనుబంధ విభాగం ఎయిర్ పోర్టు హెల్త్ ఆర్గనైజేషన్ అధిపతి డాక్టర్ ఎం.అనురాధ అన్నారు. గీతం ఇన్‌స్టిట్యూట్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సామాజిక వైద్య విభాగం ఆధ్వర్యంలో ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ 28వ వార్షిక సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ రూపొందించిన ఆరోగ్య నియంత్రణను పూర్తి స్థాయిలో కేవలం 64 దేశాలు మాత్రమే అమలు చేస్తున్నాయని, భవిష్యత్తులో వైరస్ వలన ప్రాణ నష్టం, ఆర్థిక నష్టం జరగకుండా ఉండాలంటే వైద్య ఆరోగ్య రంగంలో ప్రపంచ దేశాల మధ్య సహకారం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ టీబీ నియంత్రణ ప్రాజెక్టు సాంకేతిక సలహాదారులు డాక్టర్ ఎం.విజ్ఞేష్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ అనురాధను సత్కరిస్తున్న దృశ్యం

ట్రావెల్ బస్సు ఢీకొని రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం

పాయకరావుపేట: స్థానిక గాంధీ నామవరం సెంటర్ వద్ద బస్సు ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌ఐ బి.జోగారావు తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాలివి. పాయకరావుపేటకు చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ యర్రా వీరవెంకట సుబ్బారావు (71) తన మనవడు సుహాసన్‌తో కలిసి స్కూటర్‌పై సెంటర్ వద్ద మటన్ కొనుగోలుకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తూ హైవేపై యూటర్న్ తీసుకుంటుండగా విశాఖపట్నం వైపు అతివేగంగా ప్రయాణిస్తున్న ప్రైవేట్ ట్రావెల్ మోజో బస్సు బలంగా ఢీ కొట్టింది. దీంతో సుబ్బారావు రెండు కాళ్లు నలిగిపోగా, స్కూటర్‌పై ఉన్న మనవడు సుహాసన్ తూలి పడిపోయాడు. వెంటనే వీరిద్దరినీ తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో సుబ్బారావు మృతి చెందారు. సహాసన్‌ను మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించారు. మృతుడి కుమారుడు యర్రా నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జోగారావు తెలిపారు.